

షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలి : యుటిఎఫ్

కలెక్టరేట్ : బైజూస్ ఈ కంటెంట్ కోసం విద్యార్థులు తమ ఫోన్ నెంబర్లను అప్డేట్ చేయలేదని మన్యం జిల్లాలోని సుమారు 220 మంది ప్రధానోపాధ్యాయులకు డిఇఒ షోకాజ్ నోటీసులు ఇచ్చారని, ఈ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని యుటిఎఫ్ అధ్యక కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు లేకపోవడం వల్ల మరికొంత మంది విద్యార్థులు తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడం వల్ల కొన్నిచోట్ల నెట్‌వర్క్ సరిగా పని చేయకపోవడం వల్ల కొంతమంది ఉపాధ్యాయులకు యాప్‌ల పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో మొబైల్ నెంబర్లను అప్డేట్ చేయలేకపోయారని అన్నారు. కారణంగా చూపించి ఉపాధ్యాయుల మెడపై కత్తి పెట్టడం దారుణమన్నారు. అలాగే నోటీసులు ఇస్తూ పోతే భవిష్యత్తులో ఉపాధ్యాయులంతా తీవ్ర ఒత్తిడికి గురవుతారని, కావున వెంటనే ఈ షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



వేటగానివలసలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కుక్

ఆశ్రమ పాఠశాలల్లో కట్టెల పొయ్యిపై వంటలు

- బకాయిలు పెరగడంతో గ్యాస్ సరఫరా నిలిపివేత
- గ్యాస్ ఏజెన్సీకు రూ.20 లక్షల మేర పెండింగ్
- సొంత డబ్బుతో కొంతమంది వార్డెన్లు కొనుగోలు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గత కొద్దిరోజులుగా కట్టెలపొయ్యిలపై వంటలు వండుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గ్యాస్‌తో వంటలు చేయడానికి అలవాటుపడ్డ వంట సిబ్బంది కట్టెల పొయ్యిలపై వండడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఆరుబయట ప్రదేశాల్లో కట్టె పొయ్యిలపై వంటలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గం పరిధిలో ఉన్న నాలుగు మండలాల పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి కారణం గ్యాస్ సరఫరా చేసే ఏజెన్సీకి ఐటిడిఎ నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడమేనని తెలుస్తోంది. సుమారు రూ.20లక్షల మేరకు బకాయిలు గ్యాస్ ఏజెన్సీకి చెల్లించాల్సి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. బకాయిలు పేరుకుపోవడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సరఫరా నిలిపివేశారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వార్డెన్లు కట్టెల పొయ్యిలపై వండిస్తున్నారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వంట చేసి వడ్డించడం కుక్‌లకు కత్తిమీద సాములా మారింది. కురుకుట్టి, తోణాం, వేటగాని వలస, అంటివలసతో పాటు ఇతర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కట్టెల పొయ్యిలపైనే వడుతున్నారు. కొంతమంది వార్డెన్లు సొంత డబ్బుతో గ్యాస్ బండలు కొనుగోలు చేసి వంటలకు ఆటంకం లేకుండా చూస్తున్నారు. వసతి గృహాలకు సంబంధించిన ఏరకమైన బిల్లులు గత కొంతకాలంగా మంజూరు కాకపోవడంతో వార్డెన్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దీనికి తోడు గ్యాస్ కష్టాలు కూడా తోడవ్వడంతో వారిపై మరింత ఆర్థిక భారం పెరుగుతోంది. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గ్యాస్ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని వసతి గృహాల వంట సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఐటిడిఎ అధికారులు తక్షణమే గ్యాస్ బకాయిలు చెల్లించాలని వార్డెన్లు, సిబ్బంది కోరుతున్నారు.





ప్రకాశం, కృష్ణా జట్లకు ట్రోఫీలను అందజేస్తున్న బేబినాయన

హోరాహోరీ పోరులో వాలీబాల్ విజేతలు ప్రకాశం, కృష్ణా

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల మైదానంలో హోరా హోరీగా సాగిన రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రకాశం, కృష్ణా జిల్లాల జట్లు విజయం సాధించాయి. మూడు రోజులుపాటు జరిగిన ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 13 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా, బాలికల విభాగంలో కృష్ణా జిల్లా క్రీడాకారులు విజయం సాధించారు. సెమీ ఫైనల్‌కు బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లా జట్లు చేరుకోగా, బాలికల విభాగంలో కృష్ణా, గుంటూరు జిల్లా జట్లు చేరుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కృష్ణా, రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో ప్రకాశం, నాలుగో స్థానంలో విశాఖపట్నం జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో ప్రకాశం, రెండో స్థానంలో పశ్చిమగోదావరి, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాలుగో స్థానంలో కృష్ణా జట్లు నిలిచాయి.

ఏకపక్షంగా కృష్ణా జట్టు విజయం

బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. అయితే గుంటూరు జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, ప్రకాశం జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. రెండు జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో మొదటి సెట్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు విజయం సాధించగా రెండు, మూడు, నాలుగు సెట్లలో వరుసగా మూడు సెట్లలో ప్రకాశం క్రీడాకారులు విజయం సాధించాయి. దీంతో ప్రకాశం జిల్లా జట్టును విన్నర్ గా ప్రకటించారు.

విజేతలకు, రన్నర్లకు, మూడో స్థానం, నాలుగో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన బహుమతులు అందజేశారు.



సబ్‌జైలు నుంచి విడుదలైన సిపిఎం జిల్లా నాయకులు మన్మథరావు, శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

అక్రమ కేసులు ఎత్తివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

సాలూరు, మన్యం జిల్లా పోలీసులు ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు డిమాండ్ చేశారు. పోలీసులు పెట్టిన తప్పుడు కేసులతో గతనెల 27 నుంచి జైల్లో ఉండి బెయిల్‌పై శుక్రవారం బొబ్బిలి సబ్ జైలు నుంచి విడుదలైన వై.మన్మథరావు, మర్రి శ్రీనివాసరావు లకు సిపిఎం నాయకులు స్వాగతం పలికారు. అక్రమ అరెస్టులు, కేసులతో ఉద్యమాలను ఆపలేరని ఈ సందర్భంగా రెడ్డివేణు అన్నారు. స్వాగతం పలికిన వారిలో పొట్నూరు శంకర్రావు, మన్యం జిల్లా నాయకులు కోరాడ. ఈశ్వరరావు, వి.ఇందిర, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.గోపాలం, రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు వాసు, ఎ.సురేష్ ఉన్నారు.

బిపిఇడి ట్రైనింగ్‌కు ధర ఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్ : బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ 2022-23, 24 వరకు చేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని డిఇఒ ఎస్‌డివి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు సర్వీసులో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులకు బిపిఇడి చేసేందుకు అవకాశం కల్పించారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

మమా అనిపిస్తారా? వాస్తవాలు రాబడతారా?

- వైసిపి నాయకుని ఇంట్లో మంత్రాంగం
- కురుకుట్టి హెచ్‌ఎంపై నేడు విచారణ



ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్‌ఎం కృష్ణారావుపై శనివారం పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత నేతృత్వంలో ముగ్గురు మహిళా అధికారుల బృందం విచారణ చేపట్టనుంది. సెప్టెంబరు 17న పాఠశాల విద్యార్థినులను సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు విచారించారు. ఆయన హెచ్‌ఎం కృష్ణారావుకు అనుకూలంగా నివేదిక అందజేసినట్లు ఆరోపణలు వెలువడడంతో గిరిజన సంఘాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. జిల్లా కలెక్టర్‌కు మళ్లీ ఫిర్యాదు చేయడంతో ముగ్గురు మహిళా అధికారులతో విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అప్పట్లో వున్న సబ్ కలెక్టర్ భావన బదిలీ కావడంతో ఆర్డీవోగా హేమలత విధుల్లో చేరారు. పాఠశాల బాలికల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోకుండా అధికారపార్టీ అగ్రనేత ఒత్తిడితో జిల్లా అధికారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ సంఘటనపై ఆయన కూడా మౌనం వహించడం చర్చనీయాంశమైంది. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మంజు, పాత హెచ్‌ఎం కృష్ణారావు మధ్య వివాదంలా చిత్రీకరించిన అధికారులు లైంగిక వేధింపులకు సంబంధించిన అంశాన్ని పక్కతోవ పట్టించే ప్రయత్నం చేశారు. ప్రస్తుత హెచ్‌ఎం మంజు బాలికల చేత తనపై తప్పుడు ఆరోపణలు చేయించారనే వాదనలను పాత హెచ్‌ఎం వినిపిస్తున్నారు. ఈలోగా హెచ్‌ఎం కృష్ణారావు కొంతమంది స్థానిక వైసిపి నాయకులతో కలిసి బాలికల తల్లిదండ్రులను బతిమలాడుకున్నారనే ప్రచారం జరిగింది. ఇంఛార్జి హెచ్ ఎం మంజుపై కూడా అధికారపార్టీ నాయకులు ఒత్తిడి పెంచి బాలికల చేత గతంలో చెప్పిన దానికి భిన్నంగా చెప్పించాలని ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా మామిడిపల్లిలో వైసిపికి చెందిన వైసిపి నాయకుని ఇంట్లో శుక్రవారం ముందస్తుగా మంత్రంగా నడిపినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మంజుపై ఒత్తిడి పెంచుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీ అగ్రనేత ఒత్తిడి ఉన్న నేపథ్యంలో మహిళా అధికారుల కమిటీ సభ్యులు వాస్తవాలు రాబడతారా లేక మమ అనిపిస్తారా అనేది వేచిచూడాల్సిందే.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బకాయి జీతాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు విశేష కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు విశేష కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇస్తున్న తక్కువ జీతం కూడా ప్రతి నెలా చెల్లించకపోతే వీరి జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వీరికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగానికి పాల్పడుతోందని, దీనివల్ల ఈ దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే 10 నెలలు బకాయి జీతాలు విడుదల చేయాలని, సబ్బులు, నూనెలు, బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ యూనియన్ నాయకులు సురేష్, ప్రసాద్, ప్రకాశం, దశరథ్, పలువురు గ్రీనంబాసిడర్లు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం సందర్శన

సీతంపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం సందర్శించారు. సీతంపేట మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఎంపిక చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. దీనిపై స్కూల్ సిబ్బందికి, తహశీల్దారు ఎస్.నరసింహమూర్తికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలు ఉండాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, సూరిబాబు తదితరులు ఉన్నారు.

సచివాలయంలో డిఎల్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయాన్ని డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ శుక్రవారం సందర్శించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరుతో పాటు వాలంటీర్ హాజరు పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనన్నారు. సిబ్బంది హాజరు శాతం తక్కువగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు అయ్యేలా చూడాలన్నారు. ఈయనతో పాటు సర్పంచ్ సిరిపురపు జగదీష్ ఉన్నారు.

ఎం.సింగుపురం సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు సందర్శించారు. రికార్డులు పరిశీలించి ప్రభుత్వ పథకాలపై సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు.



సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

ఉపాధి కూలీకి పాముకాటు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట పంచాయతీలో శుక్రవారం ఉపాధి పనులు బౌండరీ ట్రెంచ్ కటింగ్ పనులు చేస్తుండగా ఆ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గోనెక్కింతల గౌరమ్మ పాముకాటు గురైనట్లు ఎపిఒ జి.నాగలక్ష్మి తెలిపారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆమె అక్కడ చికిత్స పొందుతుందన్నారు. ఆమెతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ శ్రీదేవి గౌరమ్మను పరామర్శించారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలకు గ్రీన్ ఫీల్డ్ స్టేడియం సిద్ధం

సీతంపేట : ఈనెల 5న జరుగు నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయి ఎంపికలకు స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ముస్తాబైంది. ఇప్పటికే విద్యార్థులు ప్రాక్టీస్ చేస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారు. వీటిలో ఎంపికైతే జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తారు.ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.జాకబ్ దయానంద్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు జరగనున్నాయి.

13న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ఈనెల 13న సీతానగరంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా మూడో మహాసభ జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక టిఆర్ఎం ఉన్నత పాఠశాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం యూనియన్ నాయకులు జి తులసి, సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణలు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20 పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, న్యాణ్యమైన బియ్యం, సరుకులు సివిల్ సప్లై ద్వారా పాఠశాలలకు అందించాలని, హైస్కూల్లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలని, ప్రతినెలా 5తేదీ లోగా మెనూ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు మహాసభలు జరుగుతున్నాయని, కావున మధ్యాహ్న భోజన నిర్వాహకులంతా ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.లక్ష్మి, పార్వతి, మంగ, ఇందిర, పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అనైతిక చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం అనైతిక చర్యలు మానుకోవాలని పట్టణ టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీపేరు మార్పును నిరసిస్తూ కొద్ది రోజుల క్రితం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద టిడిపి నాయకులు సంతకాలు సేకరించారు. ఆసంతకాలతో కూడిన ఫ్లెక్సీని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్య కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పేర్లు మార్చే సంస్కృతికి తెరలేపిందని అన్నారు. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ప్రదేశాలు పేర్లు , మహోన్నత వ్యక్తుల పేర్లు తో ఉన్న ప్రదేశాలు, కట్టడాల పేర్లు మార్చే ప్రయత్నం ఇప్పటివరకూ ఎవరూ చేయలేదన్నారు. కానీ వైసిపిప్రభుత్వం పేర్లు మార్చే సంస్కృతిని తీసుకొచ్చిందన్నారు. హెల్త్ యూనివర్సిటీ పేరును మార్చడాన్ని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, బొద్దల నర్సింగరావు, కనకల లక్ష్మి, వరప్రసాద్, కంది మురళీనాయుడు పాల్గొన్నారు.

7 నుంచి జోనల్ స్థాయి సాంస్కృతిక పోటీలు

కళాకారుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో కళాకారులకు సాంప్రదాయ నృత్యరీతులైన కూచిపూడి నృత్యం, ఆంధ్ర నాట్యం, భరతనాట్యం, గాత్ర (సింగింగ్), జానపద కళారూపాలైన డప్పులు, గరగలు, తప్పెటగుళ్లు, కోలాటం, చెక్క భజన, పులి వేషాలు, బుట్టబొమ్మలు, కాళికా వేషాలు, ఉరుములు, గిరిజన కళారూపాలైన థింసా, కొమ్ముకోయ, సవర, లంబాడీ తదితర విభాగాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.మల్లిఖార్జునరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. జోనల్ స్థాయి పోటీలు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కళాకారులకు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో విశాఖలోరి వుడా చిల్డ్రన్స్ థియేటర్లో పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు విజయవాడలో డిసెంబర్ 19, 20 తేదీల్లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను నవంబర్ 10లోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి కార్యాలయం, విజయవాడ నందు లేదా విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలులోని ప్రభుత్వ సంగీత, నత్య కళాశాలలు/ పాఠశాలల నందు స్వయంగా సమర్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి వెబ్ సైటులో (http://culture.ap.gov.in) దరఖాస్తును పూర్తిచేయవచ్చని ఆయన తెలిపారు. జోనల్ స్థాయి పోటీల్లో సోలో, బృంద విభాగంలో ప్రథమ విజేతలకు రూ.10వేలు, రూ.25వేలు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో పోటిల్లో సోలో, బృంద విభాగంలో ప్రథమ విజేతలకు రూ.50వేలు, రూ.లక్ష నగదు బహుమతులను అందజేస్తారని ఆయన తెలిపారు. 15 నుండి 20 ఏళ్ల వయసు గల జూనియర్ల విభాగానికి 6 నుంచి 8 నిమిషాలు, 20 నుంచి 40 ఏళ్లవయసు గల సీనియర్స్ విభాగానికి 8 నుంచి 10 నిమిషాలు ప్రదర్శన సమయం ఇవ్వబడుతుందని మల్లిఖార్జున రావు తెలిపారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, పేదలు

సాగు, పోడు భూములకు పట్టాలివ్వాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

పేదలు, గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న ప్రభుత్వ, బంజర, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంజిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గడసింగుపురం, అర్నాడ, అలమండ, తుంబలి, తాళ్లడుమ్మ, టికె జమ్ము, పిటి మండ, కొండ చిలకాం పంచాయితీల్లో పేదలు, గిరిజనులు, దళితులు వందోకరాల భూమిని గత 30, 40 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటూ జీడి, పత్తి, మొక్కజొన్న, వరి పంటలు పండించి జీవిస్తున్నారని అన్నారు. అనేక ఏళ్లుగా పట్టాలివ్వాలని కోరినా ఇవ్వడం లేదని పట్టాలేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సర్వే చేసి పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అలమండ, మరువాడ రెవెన్యూలో పెత్తందార్లు పేదల భూములు ఆక్రమించుకొని పేదలపై దౌర్జన్యం చేస్తున్నారని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేసి పేదల భూములు పేదలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం వ్యవసాయ కార్మికసంఘం మండల మహాసభ జరిగింది. ఈ మహాసభలో కొత్త కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష కార్యదర్శులుగా బి.మోహనరావు, గరుగుబిల్లి శ్రీను, సభ్యులుగా గరుగుబిల్లి రాజు, ఎగిరెడ్డి పాపమ్మ, గొరపాడు సోమయ్య, కొండగొర్రి సుబ్బారావు, సింహాచలం, కృష్ణారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.సీతారాం, పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ ప్రసాదరావు

పట్టణంలో కమిషనర్ పర్యటన

పాలకొండ : పట్టణంలో శుక్రవారం నగరపంచాయతీ కమిషనర్ పివిడి ప్రసాదరావు విస్తృత పర్యటన చేపట్టారు. లుంబూరువారివీధి, దేవరపేట, కస్పావీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టారు. రోజూ చెత్తసేకరణకు సిబ్బంది వస్తున్నారా లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఇందిరానగర్ కాలనీ సచివాలయాన్ని సందర్శించి అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతిఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో అలసత్వం వహించరాదన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

గుమ్మలక్ష్మీపురం : గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జగదీష్‌కుమార్ సూచించారు. మండలంలోని కేదారిపురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రజల నుంచి వస్తున్న వినతులు, ఇప్పటి వరకూ పరిష్కారమైన పనులపై సిబ్బందితో చర్చించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన వారందరికీ అదేలా చూడాలన్నారు. అనంతరం సచివాలయం సమీపంలో నిర్వహిస్తున్న వర్మీకంపోస్ట్ కేంద్రాన్ని, కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ ఉన్నారు.

మహిళా సమాఖ్య కార్యాలయ సందర్శన

కురుపాం : స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని శుక్రవారం డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై మండల పరిధిలో ఐకెపి ద్వారా జరుగుతున్న జగనన్న తోడు, వైయస్సార్ చేయూత, ఉన్నతి, శ్రీనిధి రికవరీ అంశాలపై సిబ్బందితో చర్చించి మహిళా సంఘాల పనితీరు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన వారందరినీ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం ఇ.వెంకటకిషోర్ ,సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి పద్మావతి

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం : మండలంలో రస్తాకుంటుబాయి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఎంపిపి శెట్టి పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన నిధులతో సిసి రహదారులు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయనికి మంజూరైన రూ.20 లక్షల నిధులకు గాను పొడి పంచాయతీకి రూ.12 లక్షలు, రస్తాకుంటుబాయి పంచాయతీకి రూ.8లక్షల నిధులతో సిసి రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, పొడి, రస్తాకుంటుబాయి సర్పంచులు ఎం.సుస్మిత, ఎ.సునీత, వైసిపి నాయకులు కోటి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

బాలకథ నిలయం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దేవానంద్



గుమ్మలక్ష్మీపురం : బాలకథా నిలయం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలంలోని మండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలక దేవానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బాలకథానిలయం ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవానంద్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ మరోవైపు కవి, రచయితగా, ప్రజ్ఞాశాలిగా ఏజెన్సీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పలు సన్మాన కార్యక్రమాల్లో పాల్గొంటూ సన్మాన పత్రం రాయడం, పాటలు పాడటం గుర్తించిన బాల కథ నిలయం ప్రతినిధులు ఎంపిక చేసినట్లు చెప్పారు. దేవానంద్ నియామకం పట్ల మండ సర్పంచ్ హైమావతి, తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.



రోడ్లపై ఉన్న ప్లాస్టిక్‌ను ఎత్తివేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్లాస్టిక్ నిషేధం బేఖాతరు

పార్వతీపురంటౌన్ : పట్టణంలో మునిసిపల్ పరిధిలో ఈ నెల 1నుంచి ప్లాస్టిక్‌పై నిషేధాన్ని విధించినట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని పలు వాణిజ్య, వ్యాపార దుకాణాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు, నిల్వలు, వాడకాలు చేయనప్పటికీ చిరు వ్యాపారులు మాత్రం కమిషనర్ ఆదేశాలతో భేఖాతర్ చేస్తూ ప్లాస్టిక్ సంచులతోనే వారు అమ్ముకునే సామాగ్రిని విక్రయిస్తున్నారు. శుక్రవారం పట్టణంలో గల సత్యనారాయణ స్వామి దేవాలయం ముందర పూజా సామాగ్రితో ఇచ్చిన ప్లాస్టిక్ సంచులు దర్శనం ఇవ్వడంతో పారిశుధ్య కార్మికులు వాటిని శుభ్రపరిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయాల శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక పర్యవేక్షణ చేపడితే తప్ప ప్లాస్టిక్ నిషేధం జరగదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చినభోగిలిలో పారిశుధ్య పనులు

సీతానగరం : మండలంలోని చిన్న భోగిలిలో సర్పంచ్ కుర్మాన రాధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉండే మురుగనీరు కాలువల్లో పూడికి తీతలు బోర్లు వద్ద పూడికితీతలు చేపట్టారు. సువర్ణముఖి నదికి వెళ్లేందుకు, నీలాటిరేవులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మక్కువ: ండలంలోని వెంకటభైరిపురంలో శుక్రవారం ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ప్రజా వైద్యశాల వద్ద ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో సర్జికల్ మహిళలకు సంబంధిత గైనకాలజిస్ట్, ఎముకలు, కంటి, చెవి, ముక్కులకు సంబంధించిన, జనరల్ మెడిసిన్ పిల్లల వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. సుమారు 200మందికి ఉచితంగా వైద్యం అందించి వారికి ఉచితంగా మందులు అందించారు. అంతేకాక సుమారుగా 40మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు, సెక్రటరీ పిట్ట పోలినాయుడు, ఎంపిటిసి వాసిరెడ్డి అప్పలనాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంలో ప్రజా గ్రంథాలయాన్ని గ్రామ పెద్దలు డి.సత్యవతి, టి.పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రంథాలయాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు పుస్తకాలు ఎంత ఉపయోగపడతాయని వీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మజ్జి తులసి, గ్రామ పెద్దలు టి.గంగు నాయుడు, టి.వెంకటరమణ, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోగులు ఫుల్.... సౌకర్యాలు నిల్

పూర్తిస్థాయిలో లేని వైద్యులు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి పెరిగింది. కురుస్తున్న మంచు, గ్రామాల్లో కలుషిత నీరు, అపారిశుధ్య వాతావరణంతో దోమకాటు వల్ల ప్రజలు మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడుతూ వైద్యం కోసం వస్తున్నారు. దీంతో రోజువారీ ఒపి 150 నుంచి 200 వరకు నమోదు కావడం విశేషం. మరోవైపు ఆశ్రమ పాఠశాలల, వసతి గృహాల విద్యార్థులు కూడా ఏదో ఒక అనారోగ్యంతో సమీపంలోనే గల ఈ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారు. వస్తున్న రోగులతో ఆసుపత్రి కిటకిట లాడుతోంది. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రంలో 12 మంది వరకు వైద్యులు ఉండాల్సి ఉండగా, ఇప్పటి వరకూ నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వైద్యులు స్థానికంగా ఉండేందుకు సరైన సౌకర్యాల్లేక రావడానికి ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. గైనకాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. ఉన్నత వైద్యం కోసం పార్వతీపురం వెళ్లాల్సి వస్తుంది. ఆపరేషన్ థియేటర్ సీనియర్ వైద్యులు లేకపోవడంతో వినియోగంలో లేకుండా పోయింది. మరోవైపు మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు రెండేళ్ల క్రితం కొత్తగా గది నిర్మించినా తోటీలు లేకపోవడంతో నేటి వరకూ ఆ గది ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో మృదేహాలను పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. సిహెచ్‌సిగా రూపాంతరం చెందినా ఇప్పటివరకూ ప్రభుత్వం ఏజెన్సీలో వైద్య సేవలు మెరుగుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గుమ్మలక్ష్మీ పురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ మండలాల్లో పనిచేస్తున్న 176మంది సవర భాషా వాలంటీర్లను రెన్యువల్ చేసి విధుల్లో నియమించాలని ఆ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేష్, భీమారావు కోరారు. సవర బాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని ఐటిడిఎ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేసిన నేపథ్యంలో పిఒ స్పందించి రెన్యువల్ చేస్తానని హామీ ఇచ్చారని, అయినా నేటి వరకు ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లా న్యాయమూర్తి అధ్యక్షతన ఈనెల 5న గిరిజన యువతకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ బి.నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు స్థానిక ఐటిడిఎ మీటింగ్ హాల్లో జరుగుతుందని, కావున గిరిజన యువత హాజరుకావాలని కోరారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిఐటియు నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర పంచాయతీ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ వర్కర్లతో కలిసి నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పివివిడి ప్రసాదరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పాలకొండ పట్టణం విస్తరిస్తుందని, పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. నగర పంచాయతీలో రెగ్యులర్ కార్మికులుగా ఏడుగురు పనిచేస్తున్నారని, అనేక ఏళ్లుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్డ్, మినీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ జీవోలు అమలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో వ్యక్తికి కారుణ్య నియామకం చేపట్టాలని, అలాగే జీవో 25 ప్రకారం రూ.2లక్షలు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇటీవల కాలంలో స్పెషల్ డ్రైవ్ కింద పనిచేసిన 34మంది కార్మికుల వేతనబకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను కొనసాగించేలా చూడాలని, పారిశుధ్య కార్మికులకు కొత్త పనిముట్లు, అవసరమైన వస్తువులు అందించాలని, కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ అధ్యక్షులు పడాల భాస్కరరావు, కార్యదర్శి చింతల సంజీవి, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కోశాధికారి పడాల వేణు, కార్యవర్గ సభ్యులు చింతల శ్రీదేవి, పడాల విమల తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం మరో అవకాశం

ప్రజాశక్తి - పాచిపెంట

అర్హత కలిగి, ఇప్పటి వరకూ రైతు భరోసా పొందని రైతులకు ప్రభుత్వం మరొక అవకాశాన్ని కల్పించింది. అర్హులైన రైతులంతా రైతు భరోసా పొందాలనేదే ప్రభుత్వ ఉద్దేశ్యమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులు ఇప్పటిదాకా రైతు భరోసా పొందనట్లయితే ఆర్‌బికెల్లో 1-బి, ఆధార్ తీసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. మొదటి శుక్రవారం సందర్భంగా రైతు భరోసా కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించామని, ఇ- పంట నమోదులో తప్పులను పూర్తిగా సరిదిద్దినట్టు తెలిపారు. ఇ-పంట జాబితాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వరి పంటలో దోమపోటు ఉధృతంగా ఉందని ప్రకృతి చర్య పద్ధతుల ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా తూటి కాడ కషాయం ఎకరానికి ఎనిమిది లీటర్లు పిచికారీ చేయడం ద్వారా దోమ పోటు అరికట్టవచ్చని అన్నారు. రసాయన పద్ధతులో అప్లాడ్ లేదా చెస్ మందులను పిచికారీ చేయడం ద్వారా ఈ తెగుళ్లను నివారించవచ్చునన్నారు. అలాగే గిరిజన రైతులకు 90శాతం రాయితీపైనా, ఇతర రైతులకు 50 శాతం రాయితీపై విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందని కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి రైతులు పాల్గొన్నారు.

రైతు మహా ప్రదర్శన జయప్రదం చేయండి

ప్రజాశక్తి కొమరాడ

రైతు సమస్యలపై పార్వతీపురంలో ఈనెల 10న తలపెట్టిన రైతు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు అక్కిన ఉపేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికజూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద, మరడాన వీధిలో రైతు మహాప్రదర్శనకు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రం లో సిఎం జగన్ అనుసరిస్తున్నారని చెప్పారు. కేరళలో మాదిరిగా ధాన్యం మద్దతుదర క్వింటాల్ రూ.2800 చెల్లించాలని కోరారు. చెరుకు బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జంఝావతి, అడారిగెడ్డ వెంటనే పూర్తి చేయాలని, పెద్దగెడ్డ ఎడమ కాలువ తక్షణమే తవ్వాలని, గుమ్మిడిగెడ్డ, రాళ్లగెడ్డ, వనకాబడి గెడ్డలపై మినీ రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. వట్టిగెడ్డలో షిల్ట్ తీసి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుల హిమరక లక్ష్మ, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.



బలిజిపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

బలిజిపేట : రైతు సమస్యలపై పార్వతీపురంలో ఈనెల 10న తలపెట్టిన రైతు మహా ప్రదర్శనను జయప్రదం కోరుతూ మండల కేంద్రమైన బలిజిపేటలో రైతు సంఘం నాయకులు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మహాప్రదర్శనకు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు తూటికాడ కషాయం ఉత్తమం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ చివర్లో వరిపంటను ఆశిస్తున్న సుడిదోమ నివారణకు తూటికాడ కషాయం చాలా బాగా పనిచేస్తుందని, దీన్ని ఉపయోగించిన రైతులే చెబుతున్నారని, కావున ప్రతి రైతు ఈ కషాయాన్ని వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని బందలుప్పి యూనిట్ పరిధిలోని పెదబొండపల్లి, చుక్కవానివలసలో అడిషనల్ మేనేజర్ ధనుంజయతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన ప్రకృతి వనురుల విక్రయ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై అపరాలలో విత్తశుద్ధికి అవసరమైన బీజామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఇటీవల సంభవించిన వాతావరణ మార్పుల వల్ల సుడిదోమ విజృంభణ ఎక్కువగా ఉందని, కోతదశకు వచ్చిన పంటపై రసాయన ఎరువులు ఉపయోగించడం వల్ల హానికలుగుతుందని అన్నారు. కావున ప్రకృతి సిద్ధంగా తయారు చేసుకున్న తూటికషాయం చక్కగా పనిచేస్తుందని అన్నారు. గ్రామాల్లో పొలంగట్లపై ఉచితంగా లభించే తూటికాడ 10కేజీలు, 10లీటర్ల ఆవుమూత్రం బాగామరగబెట్టాలని, ఆ తర్వాత వచ్చిన కషాయం 15లీటర్ల నీటిలో అరలీటరు కషాయం కలిపి పంటపై పిచికారీ చేయాలని వివరించారు. రైతులు సొంతంగా తయారు చేసుకోవడం వల్ల ఖర్చు కూడా తగ్గుతుందని, పంటకు ఎలాంటి హానికలగదని తెలిపారు.



తూటికాడ కషాయంపై అవగాహన కల్పిస్తున్న షణ్ముఖరాజు

అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదబొండపల్లిలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక సర్పంచ్ సవరపు తౌడమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు-నేడు, కన్వర్జెన్సీ నిధులు రూ.22 లక్షలతో నిర్మించబోయే ఈ భవనాలు అందుబాటులోకి రావడం వల్ల ప్రీప్రైమరీ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, మండలపార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఐసిడిఎస్ పిఒ, సూపర్వైజర్, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'పవన్'కు భద్రత కల్పించాలి

పాలకొండ రూరల్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై జరుగుతున్న కుట్రలను ఖండిస్తూ పాలకొండ నియోజకవర్గ జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, కూరంగి. నాగేశ్వరరావు ఆధ్వర్యంల పట్టణంలోని యాలం జంక్షన్ అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం నిరసనచేపట్టారు. ఈ సందర్భంగా గర్భన సత్తిబాబు మాట్లాడుతూ వవన్‌కల్యాణ్‌పై జరుగుతున్న రెక్కి తమను తీవ్రంగా ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పవన్ కళ్యాణ్ కి జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్‌పై ఎవరైనా హాని తలపెట్టినట్లైనా జన సైనికులు, నాయకులు సహించేది లేదన్నారు. పవన్ కల్యాణ్‌ను కాపాడుకునేందుకు అభిమానులు ఎంతటికైనా తెదిగించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో మిడతాన.ప్రసాద్, వండాన.సాయి, సతివాడ వెంకట రమణ, గర్భాపు నరేంద్ర, జల్లు సోముబాబు, డొంపకా సాయి, మాదాసి సంతోష్,.అజాద్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

మక్కువ : రాష్ట్రంలో జరుగుతున్న గిరిజనాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర కార్యదర్శి బాబు పాలూరి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలం లోని జనవాని కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేశారు. 20 ఏళ్ల తన రాజకీయ జీవితంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర చేసిన అభివృద్ధి గిరిజన ప్రాంతంలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. గిరిజనుల పక్షపాతినని చెప్పుకునే డిప్యూటీ సిఎం తమ రాజకీయ గణానికి తప్ప ప్రజలకు ఏమీ చేయలేదు అని విమర్శించారు. మండల కేంద్రంలోని గిరిజన ప్రాంతాల దుస్థితిని చూసి జనసేన మండల నాయకుడు రిశివర్ధన్ ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తానని చెప్పడం గర్వంగా అందని అభినందించారు. తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం సందర్శించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లా నాయకులు తూముల లక్ష్మి, సాలూరు మండల కన్వీనర్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

క్లాస్ రూమ్ బేస్డ్ అస్సెస్మెంట్ (సిబిఎ) ఫార్మాటివ్-1 పరీక్షల పరిశీలన దృష్టా మండలంలోని జగ్గునాయుడుపేట జిల్లా ఉన్నత పాఠశాలను ఎంఇఒ జి.సూరిదేముడు శుక్రవారం పరిశీలించారు. 9,10 తరగతుల విద్యార్థులు ఇంగ్లీష్, సోషల్ పరీక్షల నిర్వహణను, అలాగే ఆర్.వెంకటపేటలోని ఎంపిపిఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం జోగింపేటలోని కెజిబివి, బాలయోగి పాఠశాలల్లో 8వ తరగతి సోషల్, ఇంగ్లీష్‌పై సిబిఎ ఫార్మాటివ్-1 నిర్వహణను పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ సూరిదేముడు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ ధనుంజయరావు

పాంచాలిలో మన ఊరు-మన పోలీసు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలిలో మన ఊరు-మన పోలీస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలూరు సిఐ ధనుంజరావు గ్రామస్తులకు నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా, దాని పరిణామాలు గురించి వివరిస్తూ, తరచూ ఇదేతరహా నేరాలకు పాల్పడితే పోలీసులు కఠిన వ్యవహరించి పిడి చట్టాలను ప్రయోగించాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం, సైబర్‌నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. చిన్నపిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, పోక్సోచట్టాలను గురించి వివరించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన పోలీసులను స్నేహితులుగా భావించి సమాచారం అందిస్తే నేరాలు జరగకుండా, గ్రామంలో శాంతిభద్రతలు కాపాడు కోవచ్చని అన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి జి.యుగంధర్, ఎస్ఐ ఎంవి రమణ, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న వైద్యాధికారి జగన్మోహనరావు

ప్రజల చెంతకు వైద్యం

కొమరాడ : ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంతో ప్రజల చెంతకు వైద్యం సక్రమంగా అందుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ ఇంఛార్జి అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం కళ్లికోట(పాత)లో వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంను సందర్శించారు. క్షేత్ర స్థాయిలో పలు ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను, తద్వారా వీటి ఆవశ్యకతను స్థానికులకు వివరించారు. నీటి నిల్వ వల్ల కలిగే అనారోగ్యాలను వివరించారు. 104 వాహనంలోనే అందుబాటులో ఉన్న ఇసిజి పరికరం ద్వారా గర్భిణీలకు చేసిన ఇసిజి రిపోర్ట్‌ను జగన్మోహనరావు పరిశీలించారు. తద్వారా గుండె సంబంధిత ఆరోగ్య స్థితి తెలుస్తుందన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి ఎవరినైనా పోషకాహార లోపాన్ని గుర్తిస్తే ఎన్ఆర్ సి కేంద్రానికి పంపించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి, హ్యాండ్ వాషింగ్ పద్ధతులను పిల్లలచేత చేయించారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.వెంకటప్రదీప్, పిహెచ్ ఎన్.విజయకుమారి, వైద్య సిబ్బంది లక్ష్మి, నరేంద్ర , 104 సిబ్బంది , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

నిత్యం ప్రజా సమస్యలపైనా, ఉద్యోగ కార్మిక పక్షాన నిరంతరం పోరాడుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులైన మర్రి శ్రీనివాసరావు, వై.మన్మథరావుపై పోలీసులు అక్రమంగా కేసులను పెట్టారని, వారిపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పంతులు సుందర్రావు, కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని నార్లవలసలో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక, ఉద్యోగ, కార్మిక, తదితరుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న శ్రీనివాసరావు, మన్మథరావుపై అన్యాయంగా పోలీసులు కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం చాలా తప్పని, ప్రజల పక్షాన పోరాటాలు చేసే నాయకులను అన్యాయంగా అరెస్టు చేస్తే రాబోయే రోజుల్లో ఉద్యోగ, కార్మిక, కర్షక వ్యవస్థలకు సమస్యలపై పోరాడే నాయకులు కరువుతారని అన్నారు. దీన్ని పోలీసులు గమనించాలని కోరారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు పంట కోత ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు కోరారు. శుక్రవారం స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులకు పంట కోత ప్రయోగాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గణాంకాల అధికారి జయప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో ఎడి మధుసూదనరావు మాట్లాడుతూ మండలంలో పంటల దిగుబడి వివరాలు ఖచ్చితంగా రావాలంటే సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ అనురాధ పండా, వ్యవసాయ సహాయకులు ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.